



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 272 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 21-1-2026 పేజీలు-8 | వెల: రూ. 5.00

గ్రీన్‌లాండ్ స్వాధీనం విషయంలో

## ట్రంప్ దూకుడు

- యుద్ధ విమానం మొహరించేందుకు సిద్ధమైన అమెరికా
- ట్రంప్ ఏ క్షణాన ఏ ప్రకటన చేస్తారో, ఏ చర్యలు తీసుకుంటారోనన్న ఆందోళన
- ఈ పరిణామాలతో గ్రీన్‌లాండ్ భవితవ్యంపై ఉత్కంఠ

వాషింగ్టన్,
గ్రీన్‌లాండ్ స్వాధీనం విషయంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తోంది. తాజాగా ఆ ద్వీపంలోని కీలక సైనిక స్థావరం వద్ద యుద్ధ విమానాన్ని మోహరించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ చేసిన ప్రకటన ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ పరిణామాలతో గ్రీన్‌లాండ్ భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ ఏ క్షణాన ఏ ప్రకటన చేస్తారో, ఏ చర్యలు తీసుకుంటారోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకోవాలనే అమెరికా ఆశలను ఉద్దేశిస్తూ.. ఫ్రాన్స్ బహిరంగ విమర్శలు చేసింది. అమెరికా, కెనడా సంయుక్త రక్షణ సంస్థ అయిన 'నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్' తాజాగా గ్రీన్‌లాండ్‌కు సంబంధించి తమ సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. త్వరలోనే తమ సైనిక విమానం పిటుఫిక్ స్పేస్ బేస్‌కు

-మిగతా 2 లో



# నితిన్ నబిన్ నా బాస్

## నా బాస్ నితిన్ నబిన్ అంటూ మోడీ చమత్కారం

- బిజెపి కొత్త సారథిగా నితిన్ నబిన్ సిన్హా
- పార్టీ కార్యాయలంలో అధ్యక్ష బాధ్యతలు స్వీకరణ
- హాజరైన ప్రధాని మోడీ, నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్, గడ్కరీ
- సామాన్య కార్యకర్తకు అత్యున్నత స్థానానికి ఎదగడం బిజెపిలోనే సాధ్యం
- వివిధ అంశాలపై నితిన్ భావోద్వేగ ప్రసంగం

**న్యూఢిల్లీ జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నితిన్ నబీన్ సిన్హా మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఆయన జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ సమక్షంలో కమల దళపతిగా నితిన్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ తదితరులు హాజరయ్యారు. నితిన్ నబిన్ ఎన్నికైనట్లు పత్రాన్ని డాక్టర్ కె.లక్ష్మణ్ అందచేశారు.

-మిగతా 2 లో





మేడారం జాతరకు

## ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



- మహిళలకు ఉచిత ప్రయాణం యధాతథం
- 51 కేంద్రాల నుంచి 4వేల బస్సులు
- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్
: మేడారం జాతరకు రాష్ట్రంలోని 51 కేంద్రాల నుంచి 4వేల బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మేడారానికి వెళ్లే మహిళలకు సైతం ఉచిత ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు. రవాణా శాఖ నుంచి 10, 441 మంది సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో ఆర్టీసీ అధికారులతో మంత్రి పొన్నం

-మిగతా 2 లో


## పాకిస్థాన్ లక్ష్యం నెరవేరుతోంది

- పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి బలపడింది
- ఇస్లామిక్ దేశాల్లో పాకిస్థాన్‌కు ప్రత్యేక గుర్తింపు
- అసిమ్ మునీర్ కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు

ఇస్లామాబాద్ -
ఇస్లాం పేరుతో పాకిస్థాన్ దేశాన్ని ఏర్పాటు చేశారని, అయితే ఏ లక్ష్యంతో దేశాన్ని ఏర్పాటు చేశారో ఆ లక్ష్యం త్వరలోనే నెరవేరనున్నట్లు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అన్నారు. ఆదివారం లాహోర్‌లో ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కామెంట్ చేశారు. మాజీ ప్రధాని షాబాజ్ షరీఫ్ మనవడు జునైద్ సఫ్దార్ రిసెప్షన్‌కు ఆయన హాజరయ్యారు. పాకిస్థాన్ ఏర్పాటుకు అల్లా ఓ చరిత్రాత్మక సందర్భాన్ని కల్పించారని, ఏ లక్ష్యంతో ఈ దేశాన్ని ఏర్పాటు చేశారో, ఆ దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయన్నారు. ఇస్లాం పేరుమీద పాకిస్థాన్ దేశాన్ని సృష్టించారని, ఇప్పుడు ఇస్లామిక్ దేశాల్లో పాకిస్థాన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నట్లు మునీర్ చెప్పారు. పాక్ ప్రాముఖ్యత కూడా త్వరలో మరింత పెరగనున్నట్లు ఆయన వెల్లడించారు. క్రమంగా పాకిస్థాన్ పరిస్థితి వృద్ధి చెందినట్లు మునీర్ తెలిపారు.

-మిగతా 2 లో







సిట్ ఎన్నిసార్లు

## పిలిచినా వెళ్తాం

- ఫోన్ ట్యాపింగ్‌లో నిరాధార ఆరోపణలు
- సింగరేణి వ్యవహారంతో దృష్టి మరల్చే కుట్ర
- దాదాపు 7 గంటలపాటు ప్రశ్నించిన సిట్
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

# దావోస్‌లో రైజింగ్

## పెట్టుబడుల వేటలో సీఎం రేవంత్ రెడ్డి బృందం



- తెలంగాణ రైజింగ్ పేరుతో పెట్టుబడుల వేట
- తొలి రోజున భారత రాయబారి మృదుల్ తో భేటీ
- వివిధ పారిశ్రామికవేతలతో వరస సమావేశాలు

**దావోస్/హైదరాబాద్ జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (WEF) వార్షిక సదస్సు-2026లో తెలంగాణ రాష్ట్రం తన సత్తా చాటుతోంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌తో అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తొలిరోజు పర్యటనను అత్యంత బిజీగా గడిపింది.


**రాయబారి మృదుల్ కుమార్‌తో భేటీ**

స్విట్జర్లాండ్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జ్యూరిచ్ విమానాశ్రయంలో భారత రాయబారి

-మిగతా 2 లో

## ఫోన్ ట్యాపింగ్ దోషులకు శిక్ష తప్పదు

- చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికే డ్రామాలు
- కేటీఆర్, హరీష్ రావుల తీరుపై మండిపడ్డ పీసీసీ చీఫ్




**కామారెడ్డి,- జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతటి వారున్నా శిక్ష తప్పదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఎవరున్నా విచారణ జరుగుతుందని అన్నారు. ఈ కేసుపై ఆయన స్పందించారు. సిట్ విచారణపై హరీశ్ రావు, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై

-మిగతా 2 లో

నాసిక్‌లో రైతు సంఘటిత సాగు నమూనాలపై

## రైతు కమిషన్ అధ్యయనం





సహ్యాద్రిసామ్ ఫార్మ్స్ సందర్శనలో ఆధునిక వ్యవసాయ పద్ధతుల పరిశీలన

**నాసిక్, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రైతులు సంఘటితంగా సాగు చేస్తే ఎలా స్థిరమైన లాభాలు సాధించవచ్చో ప్రత్యక్షంగా తెలుసుకునే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో పర్యటించింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్న సహ్యాద్రి ఫార్మ్స్, సామ్ ఫార్మ్స్‌ను కమిషన్ బృందం సమగ్రంగా పరిశీలించింది. 120 ఎకరాల్లో విస్తరించిన సహ్యాద్రి ఫార్మ్స్ క్యాంపస్‌తో పాటు, 20 ఎకరాల్లో విస్తరించిన సామ్ ఫార్మ్స్ క్యాంపస్‌లను సందర్శించిన కమిషన్, రైతులు పండించిన పంటల ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను దగ్గర నుంచి అధ్యయనం చేసింది. దానిమ్మ, నిమ్మ, జామ, ద్రాక్ష, బత్తాయి, టమాట, అరటి, మామిడి, మొక్కజొన్న, ఫ్రెంచ్ బీన్స్, పైనాపిల్ వంటి పంటలకు సంబంధించిన వివిధ రకాల ప్రాసెసింగ్ యూనిట్లు కమిషన్‌ను ఆకట్టుకున్నాయి. ఉత్పత్తుల ప్రాసెసింగ్ నుంచి ప్యాకింగ్, లేబులింగ్, ఎగుమతి వరకు అనుసరిస్తున్న విధానాలను కమిషన్ బృందం స్టడీ టూర్‌లో తెలుసుకుంది. ఈ రెండు ఫార్మ్స్ నుంచి ఉత్పత్తులు దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు అనేక దేశాలకు ఎగుమతి అవుతున్నట్లు ఆయా సంస్థల నిర్వాహకులు కమిషన్‌కు వివరించారు. అదేవిధంగా సమీపంలో ఓ

-మిగతా 10 లో

## గ్రీన్‌లాండ్ స్వాధీనం విషయంలో ట్రంప్ దూకుడు

మొదటి తరువాయి

చేరుకుంటుందని అందులో వెల్లడించింది. ఈ ప్రాంతంలో రక్షణ కార్యకలాపాలకు సంబంధించిన తమ దీర్ఘకాల ప్రణాళికల్లో భాగంగా ఈ మోహరింపు చేపట్టనున్నట్లు పేర్కొంది. కెనడా, డెన్మార్క్ రాజ్యం సమన్వయంతో ఈ కార్యకలాపాలు జరగనున్నాయని, గ్రీన్‌లాండ్ ప్రభుత్వానికి దీని గురించి ముందుగానే సమాచారం అందించామని నోరాడ్ తెలిపింది. అయితే దీనిపై డెన్మార్క్ నుంచి ఇంతవరకూ ఎలాంటి స్పందన రాలేదు. అమెరికా దుందుడుకు చర్యల నేపథ్యంలో డెన్మార్క్ పెద్ద సంఖ్యలో అదనపు బలగాలను గ్రీన్‌లాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. బలగాలు, సైనిక పరికరాలను మోసుకెళ్లిన అనేక విమానాలు సోమవారం గ్రీన్‌లాండ్‌కు చేరుకున్నాయని పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ఎందుకు దృష్టిసారించారనే దానిపై అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భవిష్యత్తులో రష్యా నుంచి వచ్చే ముప్పు నుంచి కాపాడుకోవడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనిపై ఫ్రాన్స్ విదేశాంగ శాఖ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు చేసింది. 'ఏదోఒక రోజు మంటలు చెలరేగితే.. అగ్నిమాపక సిబ్బంది రావాల్సి ఉంటుంది. కాబట్టి ఇప్పుడే ఇంటిని తగలెట్టేయడం మంచిది. ఏదో ఒకరోజు కారుకు ప్రమాదం జరిగితే నష్టం వాటిల్లుతుంది. కాబట్టి ఇప్పుడే కారుకు యాక్సిడెంట్ చేయడం మంచిదని అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరింది. ఇక, గ్రీన్‌లాండ్ సాధించుకునేందుకు అగ్రరాజ్యం చేస్తున్న ప్రయత్నాలపై ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి రోలాండ్ లెస్క్యూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రయత్నాలు ఈయూ, అమెరికా మధ్య ఉన్న వాణిజ్య, ఆర్థిక సంబంధాలను ప్రమాదంలో పడేస్తాయని హెచ్చరించారు.

## పాకిస్థాన్ లక్ష్యం నెరవేరుతోంది

మొదటి తరువాయి

పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి బలపడిందని, ప్రపంచవ్యాప్తంగా పాక్ ర్యాంకు కూడా మెరుగుపడినట్లు ఆయన పేర్కొన్నారు. పాకిస్థాన్‌కు అంతర్జాతీయ గుర్తింపు వస్తున్నదని, ఒకవేళ వ్యక్తిగతంగా ప్రశంసలు వస్తే అది అల్లా దీవెనగా భావిస్తానని, కానీ నిజానికి పాకిస్థాన్‌కు గుర్తింపు వస్తోందని, ఒక్క వ్యక్తికి కాదు అని ఆయన అన్నారు. ఇటీవల అసిమ్ మునీర్ కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ ఏర్పాటుకు పునాది టూ నేషన్ థియరీతో జరిగిందన్నారు. ముస్లింలు, హిందువుల మధ్య మౌళికమైన వ్యత్యాసాలు ఉన్నాయని, ఇండోపాక్ ఒక్కటి కాదు అని, వేర్వేరు దేశాలు అని, పాకిస్థాన్ ఏర్పాటుకు పునాది కల్మా అని, భవిష్యత్తు తరాలకు ఆ ఐడియాలజీని తీసుకెళ్లడం ముఖ్యమైందన్నారు.

## దావోస్‌లో రైజింగ్

మొదటి తరువాయి

మృదుల్ కుమార్ ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన మర్యాదపూర్వక భేటీలో.. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి ఉన్న అవకాశాలను ప్రపంచ వేదికపై ఏ విధంగా ప్రదర్శించాలనే అంశంపై రాయబారితో ముఖ్యమంత్రి చర్చించారు. ఈ పర్యటనలో రాష్ట్రానికి గరిష్టంగా పెట్టుబడులు వచ్చేలా సహకరించాలని కోరారు.

వరుస సమావేశాలతో హోరెత్తిన తెలంగాణ పెవిలియన్

దావోస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక తెలంగాణ పెవిలియన్ తొలిరోజే పారిశ్రామిక దిగ్గజాలతో కళకళలాడింది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి పలు అంతర్జాతీయ సంస్థల సీఈఓలతో సమావేశమయ్యారు.

**ప్రధాన కంపెనీలతో చర్చలు:** గూగుల్, సేల్స్‌ఫోర్స్, నోవార్టిస్, టాటా గ్రూప్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులతో రేవంత్ రెడ్డి బృందం విడివిడిగా భేటీ అయ్యింది.

**నూతన విధానాల ఆవిష్కరణ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30' మరియు లిలి'తెలంగాణ ఏఐ హబ్'లిలిలను ఈ సదస్సులో భాగంగా ఆవిష్కరించనున్నారు.

**లక్ష్యం:** ఈ నాలుగు రోజుల పర్యటనలో సుమారు రూ. 2 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందాలను కుదుర్చుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

**మూడు జోన్ల అభివృద్ధి నమూనా**

తెలంగాణను వి3 ట్రిలియన్ ఎకానమీగా మార్చే క్రమంలో ప్రభుత్వం ప్రతిపాదించిన CURE, PURE, RARE (అర్బన్, సెమీ-అర్బన్, రూరల్) ఎకనామిక్ జోన్ల గురించి ముఖ్యమంత్రి అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు వివరించారు. ముఖ్యంగా 'భారత్ ఫ్యూచర్ సిటీ', 'మూసీ పునరుజ్జీవనం' వంటి ప్రాజెక్టులను గేమ్ ఛేంజర్స్‌గా పారిశ్రామికవేత్తల ముందు ఉంచారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడంలో ఈ దావోస్ పర్యటన కీలక మైలురాయిగా నిలవనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

మొదటి తరువాయి

ప్రభాకర్ సమిక్ష సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకు ఆర్టీసీ సన్నద్ధతపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్టీసీ ఈడీలు, ఆర్ఎంలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. మేడారం విధుల్లో 7వేల మంది డ్రైవర్లు - 18 మంది కండక్టర్లు, 800 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. 28వ తేదీ నుంచి 1వ తేదీ వరకు స్పెషల్ బస్సులు నడుపుతామని చెప్పుకొచ్చారు. మేడారం వెళ్లేటప్పుడు బస్సులు నిండుతాయని... వచ్చేటప్పుడు ఖాళీగా బస్సులు వస్తాయని తెలిపారు. వన్ వేలో బస్సులు ఖాళీగా వెళ్తాయి కాబట్టి... రెగ్యులర్ ఛార్జీల కంటే 50శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో 20 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేడారంలో 50ఎకరాల్లో వెయ్యి బస్సులు నిలిపేలా తాత్కాలిక బస్ షెల్టర్స్‌ను ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. నిమిషానికి నాలుగు బస్సులు వెళ్లేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. బస్ షెల్టర్ల వద్ద 9 కిలోమీటర్ల మేర 50 క్యూ లైన్స్ ఏర్పాటు చేశామని అన్నారు. బస్టాండ్స్‌లో క్లోజ్డ్ సర్క్యూట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. వీటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# నితిన్ నబిన్ నా బాస్

మొదటి తరువాయి

అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. భారత్ మాతాకీ జై అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన ఆయన.. 'ముందుగా మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఒక సాధారణ కార్యకర్తనైన నన్ను పార్టీలోనే అత్యంత ఉన్నతమైన పదవికి చేరేలా చేశారు. నేను మీకు తలవంచి నమస్కరిస్తున్నాను' అని అన్నారు. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా.. ప్రధాని మోదీపై ప్రశంసల జల్లులు కురిపించారు. ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని మోదీ నిరంతరంగా దేశం కోసం పాటుపడుతున్న తీరును సాధారణ కార్యకర్తలమైన తాము గమనిస్తూనే ఉన్నామన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'అది నేను నేషనల్ జనరల్ సెక్రటరీగా ఉన్న సమయం. అప్పుడు మీరు(ప్రధాని మోదీ) సభావన మిషన్ ప్రోగ్రామ్ సందర్భంగా ప్రతీ ఒక్కరి కష్టాలను అడిగి తెలుసుకోవటం చూశాను. ఆ ప్రోగ్రామ్ తర్వాత మేము మీ గ్రీన్ రూములో మిమ్మల్ని కలిశాము. గుజరాత్ నుంచి చాలా మంది ఆ ప్రోగ్రామ్‌కు ఎందుకు వస్తున్నారో భావోద్వేగపూరితంగా మీరు మాకు వివరించారు. ప్రజల ఎమోషన్స్‌తో కనెక్ట్ అయ్యే వారే గొప్ప నాయకులు అవుతారని నాకు అప్పుడు అర్థమయింది' అని చెప్పారు. సందర్భంగా నితిన్ నబీన్ ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడు ప్రభుత్వం తిరుప్పరన్కుంద్రం కొండపై కార్తీగై దీపం పండుగ జరగకుండా ఆపడాన్ని ఆయన తప్పుబట్టారు. సోమనాథ్, రామ సేతు, ఇతర చిహ్నాల గురించి మాట్లాడితే ప్రతిపక్ష పార్టీలు అసహనానికి గురవుతాయని అన్నారు. రామసేతు లేదు అనే వారికి, కార్తీగై దీపం పండుగను అడ్డుకునే వారికి భారత రాజకీయాల్లో చోటులేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నితిన్ నబీన్‌ను ప్రశంసించారు. ఇప్పుడు నబీన్ తనకు బాస్ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. నబీన్ తనకు బాస్ అని, తాను సాధారణ పార్టీ కార్యకర్త అని వ్యాఖ్యానించారు. 'భాజపాలో సాధారణ కార్యకర్త కూడా జాతీయ అధ్యక్షుడు కాగలరు. భాజపాలో నిర్ణయాలు, ఎంపిక అన్నీ.. ప్రజాస్వామ్యయుతంగానే ఉంటాయి. దేశసేవ, ప్రజాసేవ లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేస్తున్నారు. గతంలో ఆద్వాణీ, వెంకయ్యనాయుడు నేతృత్వంలో ఘన విజయాలు సాధించాం. అందరి కృషితోనే మూడుసార్లు అధికారంలోకి వచ్చేలా పార్టీ ఎదిగింది. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది. భాజపా కార్యకర్తను అనిపించుకోవడమే నాకుగర్వకారణం. భాజపాలో ప్రత్యేకంగా పదవులు, బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రతిఒక్క కార్యకర్త స్వయంగా బాధ్యతలు తీసుకోవాలి. బాధ్యతలు ఒకరి నుంచి ఒకరికి మారతాయి.. లక్ష్యం మారదు. నాయకత్వం మారినా.. మన గమ్యం మారదు. భాజపా చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని మోదీ అన్నారు.

45 ఏళ్ల నితిన్ నబీన్ కమల దళపతిగా నిన్న ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. పార్టీ చరిత్రలోనే చిన్న వయసులో జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఘనతను ఆయన సాధించారు. ఉమ్మడి బిహార్ నుంచి పార్టీ అధ్యక్ష స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ నిలిచారు. ప్రమాణ కార్యక్రమానికి పలు రాష్ట్రాల నేతలు, ఎంపిలు, కేంద్రమంత్రులు హాజరయ్యారు.

# సిట్ ఎన్నిసార్లు పిలిచినా వెళ్తాం

- ఫోన్ ట్యాపింగ్‌లో నిరాధార ఆరోపణలు
- సింగరేణి వ్యవహారంతో దృష్టి మరల్చే కుట్ర
- దాదాపు 7 గంటలపాటు ప్రశ్నించిన సిట్
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు




**హైదరాబాద్, –**

కేసులు, అరెస్టులు మాకు కొత్త కాదని.. ఎన్ని కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సిట్టు, లట్టు, పొట్టుకు మేం భయపడమని.. సిట్ ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వెళ్తానని స్పష్టం చేశారు. మంగళవారం ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ అనంతరం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నాపై నిరాధార ఆరోపణలు చేశారని.. విచారణ పేరుతో సమయం వృధా చేశారని అన్నారు. నోటీసులు వస్తే పారిపోమని.. ఎన్ని విచారణలు అయినా ఎదుర్కొంటామన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం సమైక్య రాష్ట్రంలో ఎన్నో కేసులు ఎదుర్కొన్నామని చెప్పారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే కేసులు పెడుతున్నారని.. కేసులు, అరెస్టులు మాకు కొత్తేమి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాలకు నిలయంగా మారిందని.. మంత్రుల మధ్య వాటాల పంచాయతీ నడుస్తోందని ఆరోపించారు.

సీఎం రేవంత్ రెడ్డి బావమరిది సింగరేణిలో వేల కోట్ల రూపాయల కుంభకోణానికి తెరతీశాడని.. ఈ స్కామ్‌ను బట్టబయలు చేసినందుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఇచ్చి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు స్కాంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తనను అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారు.. ధైర్యం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. దమ్ముంటే నన్ను విచారణ చేసినప్పుడు తీసిన వీడియో బైట పెట్టాలని.. అంతే కానీ చిల్లర లీకులు ఇవ్వొద్దని అన్నారు. ఇది లీకుల ప్రభుత్వం, స్కాముల ప్రభుత్వమని విమర్శలు గుప్పించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు ముందే ఉన్నాయన్నారు. ఇదిలావుంటే ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మంత్రి హరీష్ రావు విచారణ ముగిసింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో దాదాపు 7 గంటల పాటు సిట్ అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. హరీష్ రావు స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. విచారణ ముగిసిన తర్వాత జూబ్లీహిల్స్ పీఎస్ నుంచి నేరుగా ఆయన తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని సోమవారం హరీష్ రావుకు సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. సిట్ నోటీసుల మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లోని సిట్ కార్యాలయంలో ఆయన విచారణకు హాజరయ్యారు. సిట్ చీఫ్ సజ్జనార్ నేతృత్వంలో దాదాపు ఏడు గంటల పాటు అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మీ పాత్ర ఏంటి..? ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేయించారని సిట్ ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం. సిద్దిపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలోనే హరీశ్ రావును సిట్ విచారిస్తున్నట్టు తెలిసింది. చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హరీశ్ రావు అనుచరులను పంజాగుట్ట పోలీసులు గతంలోనే అరెస్ట్ చేశారు. సిట్ కూడా వారి స్టేట్‌మెంట్లు రికార్డ్ చేసినట్టు తెలిసింది. ఐ న్యూస్ మాజీ ఎండీ శ్రవణ్ రావుతో కలిసి హరీశ్ రావు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు సిట్ ఆధారాలు సేకరించింది. ఈ క్రమంలోనే హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసింది. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు సహా నిందితులైన మాజీ పోలీస్ అధికారుల వాంగ్మూలాలు, టెలికం సర్వీస్ ప్రొవైడర్ల నుంచి అందిన 618 నంబర్లకు చెందిన ఫోన్ ట్యాపింగ్ లిస్ట్ ఆధారంగా సిట్ దర్యాప్తు చేస్తున్నది. ఈ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, జైపాల్ యాదవ్‌ను ఇప్పటికే విచారించింది. వాళ్ల నియోజకవర్గాల్లో ప్రత్యర్థులు సహా వ్యాపారవేత్తల ఫోన్ ట్యాపింగ్ వివరాలు సేకరించింది.

# ఫోన్ ట్యాపింగ్ దోషులకు శిక్ష తప్పదు

మొదటి తరువాయి



మహేశ్ కుమార్ మండిపడ్డారు. చేసిన తప్పు కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసు అతిపెద్ద నేరమని వ్యాఖ్యానించారు. టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ తమ ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. తన ఫోన్, షబ్బీర్ అలీ సహా చాలామంది ఫోన్లు ట్యాప్ చేశారని పేర్కొన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో మహేష్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలపై రాజకీయ వేధింపులకు పాల్పడే ఉద్దేశం సీఎం రేవంత్ రెడ్డికి లేదని ఆయన స్పష్టం చేశారు. ఇంకోసారి ఇలాంటివి జరగకుండా చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. అలాగే బీజేపీపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. రాముడి, హిందు దేవుళ్ల పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని.. ఎక్కడ ఎన్నికలు వచ్చిన అక్కడ హిందు, ముస్లింలకు బీజేపీ గొడవలు పెడుతుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేవలం ఓట్ల కోసమే బీజేపీ నాయకులు జైశ్రీరాం అంటున్నారని విమర్శించారు. తనకు ఓటేసి గెలిపించిన ప్రజల కష్ట సుఖలను గాలికి వదిలేసి కేవలం ఓట్ల కోసమే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పని చేస్తున్నాడని దుయ్యబట్టారు. నిరుపేద ప్రజలకు ఉపాధిని కల్పించాలనే సదుద్దేశంతో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించడం కరెక్ట్ కాదన్నారు. గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ జనవరి 26 తరువాత ప్రతి గ్రామంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా కేంద్రంలోని మోడీ సర్కార్ పని చేస్తోందని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ గొప్ప పార్టీ అని.. అలాంటి పార్టీలో ఉండటం అదృష్టమని అన్నారు. కార్యకర్తల కృషి వల్లే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్బంధలు ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీ కోసం కార్యకర్తలు కృషి చేశారని కొనియాడారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నామని చెప్పారు. ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని.. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇక, ప్రతి గ్రామంలో సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాలనలో సర్పంచులదే మూడో స్థానమన్నారు.

# నేదునూరి మాట

## జీవితానికి దిశానిర్దేశం చేసే అదృశ్య శక్తి నాన్న

అలుపెరుగని ప్రయాణం నాన్న
కుటుంబం కోసం నిరంతరం కృషి
చేస్తూ కన్నీటిని దిగమింగుతూ
మన నవ్వుల కోసం శ్రమించే
నిత్య శ్రామికుడు నాన్న
పైకి కనిపించని కన్నీటి సముద్రం
బాధలెన్ని ఉన్న లోపల దాచుకున్న
బాధ్యతల పర్వతం నాన్న

ఎండలో ఎండుతూ నీడనిచ్చే
చెట్టునాన్న
చీకటిలో వెలుగును చూపే
ధైర్యం దివిటీ నాన్న
కష్టాలను చిరునవ్వుతో
భరించే యోధుడు

త్యాగానికి అర్థం నాన్న
ప్రేమకు రూపం నాన్న
తనను తాను కరిగించుకొనే
కొవ్వత్తి లాంటి వాడు నాన్న
కొవ్వొత్తి కరుగుతూ వెలుగును
పంచి చీకటిని తొలిగిస్తుంది
తన సుఖాలను త్యాగం చేస్తూ
కుటుంబ ప్రగతికి పరితపించే
వాడు నాన్న

నాన్నా అంటే భద్రత
నాన్న అంటే నమ్మకం
నమ్మకాన్ని నూరిపోసిన
ఆయుధం నాన్న
నాన్న అంటే ఒక ధైర్యం
నాన్న అంటే ఒక రక్షకుడు

నాన్న తోనే జీవితం
అడుగులు నేర్పి అణుకువ
ఆర్ధత ఆత్మీయత ఆదరణ
అనురాగాలు రంగరించి
బంధాలను అనుబంధాలను
పెంచింది పంచింది నాన్న

లక్ష్యసాధనలో విఫలమైనప్పుడు
విజయాల బాటలో నడవడానికి
సంకల్ప బలాన్ని ప్రేరేపించి
శక్తి సామర్థ్యాలను మేల్కొలిపే
చైతన్య శక్తి నాన్న

మమత మానవీయత మర్యాదలు
నేర్పిన తొలి గురువు నాన్న జీవిత
సత్యాలను బోధిస్తాడు
జీవితానికి దశ దిశ నాన్న


అమ్మ నవమాసాలు మోసి
జన్మనిస్తే ఆ జన్మకు ఒక అర్థాన్ని
ఇచ్చే వాడునాన్న
తను అరిగిపోతూ మనల్ని
తీర్చిదిద్దే ఓ అపురూపమైన
చందనపు చెక్క నాన్న

ఓటమి ఎదురైనపుడు నేను
ఉన్నాననే వెన్ను తట్టే ధైర్యం
గెలుపు పిలుపులో గర్వంగా
తలెత్తుకునే కీర్తి చిహ్నం

కష్టాలకు ఎదురు నిలబడి
మనల్ని ఒడ్డుకు చేర్చే ధైర్యపు
వారిధి నాన్న
పైకి ప్రేమించకపోయినా
గుండె నిండా మన గురించి
తపించే హృదయానికి
నిలువెత్తు నిదర్శనం
మన ఎదుగుదల వెనుక ఉన్న
మూల స్తంభం నాన్న

నాన్న అంటే కేవలం ఒక వ్యక్తి కాదు
ప్రతి బిడ్డ జీవితానికి దిశానిర్దేశం
చూపే అదృశ్య శక్తి
నాన్నను ఆదరిద్దాం ఉన్నత
స్థాయిలో రాణించి ఉత్తమ
పౌరునిగా ఎదిగి
నాన్న ఆశయాలు సాధిద్దాం
సమాజానికి ఆదర్శంగానిలుద్దాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
1)తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
2)తెలంగాణ ఎకనామిక్ ఫోరం
3)మాజీ కరెస్పాండెంట్ జస్టిస్
కుమారయ్య లా కాలేజీ
కరీంనగర్
(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్
జస్టిస్ జస్టిస్ కుమారయ్య 1969బి 1971)
కరీంనగర్
9440245771




# భక్తిశ్రద్ధలతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం తిరుకల్యాణ మహోత్సవం

**వినోభా నగర్, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధల మధ్య శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. అభిషేకం, హోమం, సామూహిక లలితాసహస్రనామ పారాయణం, కుంకుమార్చనలతో వాతావరణం పవిత్రతతో నిండిపోయింది. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుకల్యాణ మహోత్సవం వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించబడింది. పండితులు అమ్మవారి ఆత్మార్పణ విశిష్టతను, తిరుకల్యాణ మహిమను భక్తులకు వివరిస్తూ ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. స్వామి, అమ్మవార్ల అనుగ్రహాన్ని పొందేందుకు పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, భక్తులు







సమూహంగా పాల్గొన్నారు. తీర్థప్రసాదాన్ని స్వీకరించిన అనంతరం అన్నప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. 300 మందికి పైగా భక్తులు ఉత్సాహంగా పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. భక్తి, పవిత్రత, సామూహికత సమన్వయమై ఈ వేడుక సమాజానికి శాంతి, శ్రేయస్సు ప్రసాదించింది.

# బహుమతుల ప్రధానం



**ఆమనగల్లు, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర) ప్రాంగణంలో మంగళవారం మండల విద్యాధికారి పాండు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. జ్ఞాన వాహిని ఫౌండేషన్ సభ్యులు తరగతుల వారీగా ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన చూచి రాత పరీక్ష పోటీలలో విజేతలైన విద్యార్థులను ఎంపిక చేసి జ్ఞానవాహిని ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు షీల్డ్ తో పాటు, నగదు ప్రోత్సహకాన్ని విద్యార్థులకు మండల విద్యాధికారి పాండు వారికి అందించారు. అందులో భాగంగా మంగళపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నకేశవ కాలనీ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని శైలజ, ప్రథమ బహుమతి మంగళపల్లి లోని ఎంపీ యూపీఎస్ ప్రభుత్వ పాఠశాల 5 వ తరగతి విద్యార్థులు దీక్షిత, ద్వితీయ బహుమతి కుమార్ తృతీయ బహుమతులు గెలుపొందారు. వీరికి షీల్డ్ తోపాటు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ బికుమాండ్ల వాసు, జూలూరి రవీందర్, సత్యనారాయణ, జిహెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు మమత, ఉమామహేశ్వరి, అలివేలు,లక్ష్మణ్ ,శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ చౌరస్తా విస్తరణకు లక్ష సంతకాల పోరాటం




**షాద్ నగర్, జనవరి 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** షాద్ నగర్ పట్టణ చౌరస్తా రోడ్డు విస్తరణ కోసం యువకుడు ఆర్.ఎన్. రాము చేపట్టిన లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం ఊపందుకుంది. ఈరోజు పట్టణ కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయవాదులను కలిసి సంతకాలు సేకరించాడు.న్యాయవాదులు సంఘీభావం తెలుపుతూ సంతకాలు చేసి, చౌరస్తా విస్తరణ ప్రజలకు మేలు చేస్తుందని, ప్రమాదాల నివారణకు దోహదపడుతుందని పేర్కొన్నారు.ఆర్.ఎన్. రాము మాట్లాడుతూ, ఇది స్వలాభం కోసం కాదని, ప్రజల ప్రాణాలను కాపాడే ధ్యేయంతోనే లక్ష సంతకాల సేకరణ చేస్తున్నానని తెలిపారు. ఇప్పటికే అధికారులకు వినతిపత్రాలు సమర్పించానని, ప్రజల నుండి అపూర్వమైన స్పందన లభిస్తోందని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని విన్నవించారు.

# గట్టుఇప్పలపల్లి ని మండలం గా ప్రకటించండి



**తలకొండపల్లి, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా, కల్వకుర్తి జిల్లా కేంద్రంగా ప్రకటించాలని టిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గ్రామాన్ని మండలం గా ప్రకటించాలని దీక్షలు చేసి సీఎం, మంత్రులు, ఎంపీ ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, వెంకటయ్య, శరత్ చంద్ర శర్మ, కృష్ణయ్య, మహేష్, జంగయ్య, తదితరులు ఉన్నారు.

# రైతులకు యాంత్రీకరణ పనిముట్ల పంపిణీ




**మిర్యాలగూడ, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మిర్యాలగూడ మండల కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు యాంత్రీకరణ సప్సిడీపై పనిముట్ల పంపిణీ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ వేడుకలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి , ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పాల్గొని రైతులకు పనిముట్లు, యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం అని, రైతన్నలను ప్రోత్సహించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సప్సిడీ ద్వారా ఆధునిక వ్యవసాయ యాంత్రాలు అందజేస్తూ రైతులకు అండగా నిలుస్తుందని తెలిపారు. అలాగే ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ, 500 రూపాయల బోనస్ వంటి పథకాల ద్వారా రైతులకు సహాయం అందించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాంగాంగ్ సరస్సుకు సరికొత్త అతిథులు

**న్యూఢిల్లీ - జనవరి 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం కాంగ్రాలోని పాంగాంగ్ సరస్సు ఏటా వలస పక్షులతో కళకళలాడుతుంది. సైబీరియాకు చెందిన బార్-హెడెడ్ గూస్ పక్షులు ప్రతి ఏడాది శీతాకాలంలో ఇక్కడ పక్షి ప్రేమికులకు కనువిందు చేస్తాయి. అయితే ఈసారి గూస్



బర్డ్స్‌తోపాటు రెండు అరుదైన జాతుల పక్షులు ఇక్కడ దర్శనమిచ్చాయి. పక్షి ప్రేమికులు వాటిని చూసి ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. వాటి గురించి వన్యప్రాణి సంరక్షణ అధికారులకు సమాచారం అందించారు. అయితే ఆ పక్షులు ఏ జాతికి చెందినవి..? ఎక్కడి నుంచి వలస వచ్చాయి..? అనే వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు చెప్పారు. ఈ రెండు రకాల పక్షులు పాంగాంగ్ సరస్సుకు రావడం ఇదే తొలిసారని తెలిపారు.

# షాద్ నగర్‌లో బస్తీ దవాఖాన ప్రారంభం

**షాద్ నగర్, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** షాద్ నగర్ పట్టణంలోని 20వ వార్డు గంజిలో బస్తీ దవాఖానను ఎమ్మెల్యే వేళ్లపల్లి శంకర్ రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి లలితాదేవితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేటు దవాఖానలకు దీటుగా తీర్చిదిద్ది పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో షాద్ నగర్‌లో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి కూడా అందుబాటులోకి రానుందని చెప్పారు. జిల్లా వైద్యాధికారి లలితాదేవి మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్ని రకాల వైద్య సేవలు, రక్తపరీక్షలు, మందులు అందుబాటులో ఉంటాయని, ప్రతి వారంలో ప్రత్యేక సేవలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



# చిల్కనగర్‌లో "అరైవ్ అ లైవ్" రోడ్డు భద్రతా కార్యక్రమం




రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ అధికారి...



రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వయంకృషి ఆటో యూనియన్ అధ్యక్షులు చిప్పల శ్రీధర్...

**ఉప్పల్, జనవరి 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఉప్పల్ పరిధిలోని చిల్కనగర్ చౌరస్తాలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "అరైవ్ అ లైవ్" రోడ్డు భద్రతా కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ పోలీస్ స్టేషన్ సీఐ ఎలక్షన్ రెడ్డి, ఎస్సై చిరంజీవులు హాజరయ్యారు. సీఐ ఎలక్షన్ రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపడం వలన అనేక ప్రాణాలు బలవుతున్నాయని హెచ్చరించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఎస్సై చిరంజీవులు ప్రతి డ్రైవర్ వద్ద ఐడీ కార్డు ఉండాలని, అందులో రక్తగ్రూపు వివరాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. డ్రైవర్లు చిన్న చిన్న లైఫ్ ఇన్సూరెన్స్‌లు చేయించుకోవాలని కూడా సూచించారు. స్వయం కృషి ఆటో యూనియన్ అధ్యక్షుడు చిప్పల శ్రీధర్ మాట్లాడుతూ తమ యూనియన్‌లో ఎనిమిది మంది దివ్యాంగ ఆటో డ్రైవర్లు ఉన్నారని, ఎవరు మద్యం సేవించి ఆటో నడిపితే మూడు నెలలపాటు ఆటో నడపకుండా బహిష్కరిస్తామని తెలిపారు. చిల్కనగర్ చౌరస్తాలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ జామ్ అధికంగా ఉంటుందని, ఒక ప్రత్యేక ట్రాఫిక్ అధికారిని నియమించాలని ఉప్పల్ ట్రాఫిక్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, ఉప్పల్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ దేవసాని బాలచందర్, బీజేపీ సీనియర్ నాయకులు సంగి స్వామి యాదవ్, శామీర్పేట చంద్రయ్య, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి బోడ విద్యాసాగర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆటో యూనియన్ డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

**షాద్ నగర్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ హనీఫ్**



**ఆమనగల్లు, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** రోడ్డు భద్రత నియమాలు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని షాద్ నగర్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ హనీఫ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని అరబిందో ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై విద్యార్థులచే సామూహిక ప్రతిజ్ఞ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ద్విచక్ర వాహనాలను నడపరాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 108 వాహనాన్ని తనిఖీ చేసిన ప్రోగ్రాం మేనేజర్



**ఆమనగల్లు, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు పట్టణంలో మంగళవారం 108 వాహనాన్ని పోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ సయ్యద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న మందులు, వాహనంలో ఉన్న పరికరాల తీరును పరిశీలించారు. అనంతరం ఈఎంటీ కళ్యాణ్ ను వాహనంకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాద బాధితులు, రోగులను సకాలంలో ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జాన్ సయ్యద్ సూచించారు. అదేవిధంగా 102 వాహనం యొక్క పనితీరును అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఒడి వాహనం 102 అంబులెన్సు గర్భిణి స్త్రీలకు ఈ వాహనం ఒక వరం లా ఉపయోగపడుతుందని ప్రదీప్ చెప్పారు. కార్యక్రమంలో ఈఎంఈ రాజబాబు, పైలట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గోపాల మిత్రల సంఘం జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**- జిల్లా అధ్యక్షులు గా కలకొండ మొగులయ్య**



**నాగర్ కర్నూల్, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖకు అనుబంధంగా పనిచేస్తున్న గోపాలమిత్రల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా శాఖ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు సంఘం నాయకులు తెలిపారు. గోపాల మిత్రలు పాడి రైతులకు కృత్రిమ గర్భధారణ, పశువుల ఆరోగ్య సంరక్షణ వంటి సేవలు అందిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో మంగళవారం రోజు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . ఈ నూతన కమిటీలో జిల్లా అధ్యక్షులు గా కలకొండ మొగులయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని గోపాలమిత్రల సమస్యలు పరిష్కరించడం తో పాటు పశుసంవర్ధక రంగాన్ని మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తమని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికలో ఉపాధ్యక్షులుగా జే. నిరంజన్, తిరుపతయ్య, గోపాలు, వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా మారేడు యాదగిరి ఎన్నిక కాగా, సహాయ కార్యదర్శులుగా హనుమకొండ నరేష్, తెర్మటి రాజేందర్, ఎస్. శేఖర్, వి. యాదగిరి, బి. రవీందర్ రెడ్డి, కే.మన్మధ చారి కోశాధికారులు గా దాసర వెంకటస్వామి, జక్క జనార్ధన్, దశరథం , ప్రచార కార్యదర్శులుగా డి. జగత్ రెడ్డి, టి. శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

# ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి




**ఆమనగల్లు, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ అనురాగిణి రెడ్డి సూచించారు. మంగళవారం ఆమనగల్లు సీహెచ్ సీ ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతన ఆసుపత్రి భావన నిర్మాణ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు నాగరాజు, మైమునా బేగం, జయశ్రీ, మంజులా దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# గంగవరం రామకృష్ణారెడ్డి నుంచి దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్‌కు "ఖాళీ కుర్చీ" అందజేత



**కొత్తకోట జనవరి 20( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** కొత్తకోట లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే గౌని మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్)కు సామాజికవేత్త, ఉపాధ్యాయుడు, రచయిత గంగవరం రామకృష్ణారెడ్డి రచించిన 'ఖాళీ కుర్చీ' పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే జీఎంఆర్ ఆనందం వ్యక్తం చేశారు. తమ నియోజకవర్గానికి చెందిన గంగవరం రామకృష్ణారెడ్డి ఒక మంచి సందేశాత్మక పుస్తకాన్ని రచించడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మదనపురం మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, మిరాసిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్నాటి శివం, సింగిల్ విండో డైరెక్టర్ గంగవరం నీలవర్ధన్ రెడ్డి, కర్నాటి నందుకుమార్, విలియంకొండ ఉప సర్పంచ్ సీతరాములు, కర్ణాకర్, రాము, ముజ్జు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాదయాత్రకు సంఘీభావం తెలిపిన కండె భాస్కర్



**ఆమనగల్లు, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సినీ నటుడు బండ్ల గణేష్ చేపట్టిన షాద్‌నగర్‌తిరుపతి సంకల్ప పాదయాత్ర మంగళవారం జడ్చర్లకు చేరుకుంది. ఈ పాదయాత్రకు సంఘీభావంగా ఆమనగల్లు టీడీపీ రాష్ట్ర నాయకుడు కండె భాస్కర్ పాల్గొని బండ్ల గణేష్‌తో కాసేపు చర్చలు జరిపారు. టీడీపీ బలోపేతం కోసం కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

# అనంతుల శారద స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం






**కొండపాక, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: అనంతుల ప్రశాంత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు శ్రీమతి అనంతుల శారద (ఎక్స్ ఎంపీపీ & ఎక్స్ సర్పంచ్) స్మారకార్థం గత పదిహేను రోజులుగా మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 20 జట్లు పాల్గొని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాయి. ఫైనల్ పోరులో కొండపాక, దుద్దెడ జట్లు తలపడగా, దుద్దెడ జట్టు విజేతగా నిలిచి రూ.50 వేల ప్రైజ్ మనీని గెలుచుకుంది. రెండవ స్థానంలో నిలిచిన కొండపాక జట్టు రూ.25 వేల ప్రైజ్ మనీని అందుకుంది. విజేతలకు బహుమతులను అనంతుల ప్రశాంత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అనంతుల ప్రశాంత్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, నాయకులు, క్రికెట్ అభిమానులు పాల్గొని ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. టోర్నమెంట్ విజయవంతం కావడానికి సహకరించిన క్రీడాకారులు, నిర్వాహకులు, అభిమానులకు ట్రస్ట్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. ఓడిన జట్లు నిరుత్సాహపడకుండా, వచ్చే పోటీల్లో మరింత ఉత్సాహంతో పాల్గొనాలని ట్రస్ట్ ఆకాంక్షించింది. ప్రతి రోజూ ఆటగాళ్లకు నీరు, భోజన వసతులు కల్పించిన అనంతుల ప్రశాంత్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎం కప్ టోర్నమెంట్‌ప్రారంభం



**మనోహరాబాద్, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలో సీఎం కప్ టోర్నమెంట్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్, ఎంపీడీవో కలిసి టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టారు. మొదటి రోజు మండల కేంద్రంలోని జెఎంజే పాఠశాలలో వాలీబాల్ పోటీలు నిర్వహించగా, మనోహరాబాద్ క్లస్టర్‌లోని 12 గ్రామాల నుంచి 6 జట్లు తలపడ్డాయి. క్రీడాస్ఫూర్తితో సాగిన ఈ పోటీలను విద్యార్థులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పీడీ మంజుల వీక్షించారు.

# జిల్లా పంచాయతీ అధికారిని కలిసిన సర్పంచ్



**ఎలిగేడు, జనవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్యను సోమవారం ర్యాకల్ దేవ్‌పల్లి సర్పంచ్ మద్దెల రమాదేవి- సంపత్ , ఉపసర్పంచ్ బోడిగే శివకృష్ణ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలోనీ పలు సమస్యలపై చర్చించారు. ప్రజా సమస్యలను గుర్తించి అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సూచించారు. గ్రామాభివృద్ధికి సంబంధించి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

# గ్రామ పంచాయతీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఆర్టీఐ బోర్డుల లోపాలు..! - ఆర్టీఐ సతీష్

గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆర్టీఐ బోర్డులు తప్పనిసరి సమాచార హక్కు చట్టం ఉల్లంఘనలపై చర్యలు అవసరం – ఆర్టీఐ సతీష్ ఆర్టీఐ రక్షక్ వ్యవస్థాపక అధ్యక్షులు
సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ బోర్డులు స్పష్టంగా, అప్డేట్ చేసి ఉంచడం తప్పనిసరి అని చట్టం స్పష్టంగా పేర్కొంటోందని ఆర్టీఐ రక్షక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్టీఐ సతీష్ అన్నారు. అయితే, అనేక గ్రామ పంచాయతీలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, జిల్లా కార్యాలయాల్లో ఆర్టీఐ బోర్డులు లేకపోవడం, పాత సమాచారం ఉంచడం, పిఐఓ, మొదటి అప్పిలేట్ అధికారుల వివరాలు ఇవ్వకపోవడం, చదవడానికి వీలులేని విధంగా బోర్డులు చెరిగిపోవడం వంటి ఉల్లంఘనలు ప్రతి కార్యాలయంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**సమాచార హక్కు చట్టం లోని ూవమ్ఙఅశీఅ 4 (1)(ఎ) ఏమంటుంది?**

సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 (1)(బి ) ప్రకారం 17అంశాలు ప్రతి ప్రభుత్వ అధికారి (పబ్లిక్ అథారిటీ) తన విధులు, అధికారాలు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ పేరు, హోదా ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ వివరాలు ఆర్టీఐ దరఖాస్తు విధానం

ప్రజలకు సులభంగా కనిపించే విధంగా ప్రదర్శించాలి. ఆర్టీఐ బోర్డులు పెట్టడం ఈ సెక్షన్ కింద తప్పనిసరి అధికారుల బాధ్యత. "ప్రజలు అడగకముందే సమాచారం స్వచ్ఛందంగా (సుమోటో) గా అందించాలి" ఆర్టీఐ బోర్డు పెట్టకపోవడం అంటే స్వచ్ఛంద సమాచార వెల్లడి చేయకపోవడమే. ఆర్టీఐ బోర్డు లేకపోవడం లేదా పాత సమాచారం ఉంచడం అంటే
ప్రజల మౌలిక హక్కుల ఉల్లంఘన
పరిపాలనా నిర్లక్ష్యం ఇది చట్టపరంగా ఫిర్యాదు చేయదగిన అంశం.

**ఏ ఏ కార్యాలయాల్లో తప్పనిసరిగా ఉండాలి?**

ఆర్టీఐ బోర్డులు తప్పనిసరిగా ఉండాల్సిన కార్యాలయాలు:
గ్రామ పంచాయతీ కార్యాలయాలు మండల పరిషత్ (ఎంపిడిఓ) కార్యాలయాలు, మున్సిపాలిటీ / కార్పొరేషన్ కార్యాలయాలు జిల్లా కలెక్టర్ కార్యాలయం, అన్ని శాఖల జిల్లా, రాష్ట్ర కార్యాలయాలు ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, పి ఎస్ యు లు. ప్రస్తుత పీఐఓ / మొదటి అప్పిలేట్ అధికారుల వివరాలు తప్పనిసరిగా అప్డేట్ చేయాలి సమచార హక్కు చట్టం లోని సెక్షన్ 4 ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలి చట్టం అమలుకు అన్ని జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలి.

**ప్రభుత్వ కార్యాలయంలో ఆర్టీఐ బోర్డు లేకపోతే లేదా తప్పుగా ఉంటే:**

సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 (1)(బి) కింద ఆర్టీఐ అప్లికేషన్, కలెక్టర్‌కు ఫిర్యాదు,
స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషన్‌కు కంప్లైంట్ చేయవచ్చని చట్టం సూచిస్తుంది.
రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్ని కార్యాలయాల్లో యూనిఫాంగా ఆర్టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలనీ ఆర్టీఐ రక్షక్ సంస్థ కోరుతుంది.

**ఆర్టీఐ సతీష్**
**ఆర్టీఐ రక్షక్ వ్యవస్థాపక అధ్యక్షులు**
**7989211956**



# శిథిలావస్థకు చేరుతున్న ప్రభుత్వ భవనాలు

**- నిరుపయోగంగా ఉన్న బీసీ హాస్టల్ భవనం**
**- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం**




**ఎలిగేడు, జనవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: సురక్షితమైన వసతి సౌకర్యాలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించి నాడు కలకలలాడిన బీసీ హాస్టల్ భవనం నేడు వేలవేల పోతుంది. సాంకేతిక విద్యాపరంగా వెనుకబడిన బీసీ వర్గాల పిల్లలకు విద్యా అవకాశాలు కల్పించేందుకు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఎలిగేడు బీసీ హాస్టల్ ప్రభుత్వ భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థుల సంఖ్య తగ్గింది అనే కారణాలతో ఎలిగేడు బీసీ హాస్టల్ ను సుల్తానాబాద్ పట్టణానికి తరలించారు. దీంతో ఈ మండల పరిధి లోని గ్రామాల నిరుపేద విద్యార్థులు దూర ప్రాంతాల్లోని బీసీ హాస్టల్ కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడ్డాయి.
లిప్రభుత్వ భవనాలను పట్టించుకోని అధికార యంత్రాంగంలి
ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ భవనాల ఆలనా పాలన కరువవడంతో పక్కా భవనాలు దెబ్బతింటున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృధా అవుతోంది. మండల కేంద్రంలో బీసీ హాస్టల్, మూతపడటంతో ఆ భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంది. బాలికల ఉన్నత పాఠశాల కు ఉపయోగకరంగా ఉంటుందని నిర్మించిన రెండంతస్తుల భవనం గత కొన్ని నెలల వరకు నిరుపయోగంగా ఉంది. ఇటీవల అందులో తాత్కాలికంగా పోలీస్ స్టేషను ప్రారంభించారు. ఇప్పటికే పోలీస్ స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయించడం జరిగింది .నిర్మాణ పనులు మొదలై పోలీస్ స్టేషన్ భవనం పూర్తిగా అందుబాటులోకి వచ్చినట్లయితే మరల ఈ బిల్డింగ్ నిరుపయోగంగా మారనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం మూలంగా మండల కేంద్రంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.

**ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించాలి**

ప్రజలకు సుపరిపాలన అందించేందుకు నిర్మించిన ప్రభుత్వ భవనాలు కొన్ని కారణాలతో మూతపడ్డాయి. ఆ భవనాలను అలాగే వదిలేయకుండా ఎలిగేడు ప్రజల చిరకాల ఆకాంక్ష మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఖాళీగా ఉన్న భవనాలను అలాగే వదిలేస్తే శిథిల మావడం తప్పా ఏ మాత్రం ఉపయోగపడవని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏ శాఖకు అవసరమైన వాటిని ఉపయోగించుకునేలా అధికారులు ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# హరీష్ రావుపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్



**హుస్నాబాద్, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావుపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపిస్తూ హుస్నాబాద్ బిఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎమ్.ఏ. అన్వర్ పాషా మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ, దృష్టి మళ్లించేందుకు బిఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతోందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజా వ్యతిరేక విధానాలపై గొంతెత్తే నాయకులను అణచివేయడమే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. రెండు సంవత్సరాలుగా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని, పేద ప్రజలకు ఉపయోగపడే పనులు చేయలేదని వారు ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్‌పై ఆరోపణలతో కాలం గడిపి, వాస్తవాలు చెప్పే నాయకులను అక్రమ కేసులతో వేధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, లేకపోతే బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల చంద్రయ్య, బీలునాయక్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బూర వెంకన్న గౌడ్, చిత్తారి శ్రీనివాస్, వాల నవీన్, గందే చిరంజీవి, కుడితాటి భాస్కర్, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, పిట్టల జ్యోతి బస్, బొల్లి శ్రీనివాస్, పూదరి రవీందర్ గౌడ్, కందుకూరి సతీష్, జేరిపోతుల సునీత తదితరులు పాల్గొన్నారు.

# గ్రామలలో సూచిక బోర్డుల ఏర్పాటు

**పాలకుర్తి, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




పాలకుర్తి మండల కేంద్రంలోని గ్రామ శివారులో గ్రామం పేరుతో సూచిక బోర్డులను సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ సతీమణి మనాలి ఠాకూర్ హాజరై పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేశారు. గ్రామాల గుర్తింపునకు సూచిక బోర్డులు అవసరమని మనాలి ఠాకూర్ పేర్కొన్నారు. ఇంతకాలం మండల కేంద్రంలో గ్రామం పేరుతో బోర్డులు లేకపోవడంతో ప్రజలు, అధికారులు, నాయకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇకపై అలాంటి సమస్యలు రాకుండా గ్రామ నలుమూలలా బోర్డులు ఏర్పాటు చేశామని సర్పంచ్ తిరుమల తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుగ్గ రామస్వామి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మెరుగు అశోక్ గౌడ్, పికిలెంకి శ్రీనివాస్, పెద్దపల్లి ఆజిమల్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కఠిన నిఘా కలెక్టర్ బి చంద్రశేఖర్

**ఎఫ్ఎస్‌టి , ఎస్ఎస్‌టి (ఫ్లయింగ్ స్క్వాడ్ ) స్టాటిక్ సర్వైలెన్స్ టీం ల పాత్ర అత్యంత కీలకం**





**నల్లగొండ ,జనవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మంగళవారం ఆయన ఉదయాదిత్య భవన్ లో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన ఎఫ్ ఎస్ టి ,ఎస్ ఎస్ టి ,ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి ఉల్లంఘనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నగదు, మద్యం, బహుమతులు, ఇతర ప్రలోభక వస్తువుల అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకోవాలని అన్నారు.చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ, అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎఫ్ఎస్‌టి బృందాలు క్షేత్రస్థాయిలో చురుకుగా తిరుగుతూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు.

బృందాల నిర్వాణ?బాధ్యతలు ఎలా నిర్వహిస్తారు?డబ్బు, మద్యం పట్టుబడితే ఎలా సీజ్ చేస్తారో? ఆయా బృందాలను అడిగి తెలుసుకున్నారు . మున్సిపల్ ఎన్నికల హ్యాండ్ బుక్ ఒకటి పది సార్లు చూసుకొవాలని,అవసరమైతే మున్సిపల్ కమిషనర్ సలహాలను తీసుకొవాలన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జిల్లా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, వాట్సాప్ గ్రూప్ ను ఏర్పాటు చేసి ఏవైనా సమస్యలు ఉంటే గ్రూప్ ద్వారా తెలియజేయాలని ఆదేశించారు. ఉద్యోగులు ఎన్నికలలో రాజకీయ పార్టీలకు సహాయం చేసిన ,ప్రచారం చేసినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు.జిల్లాఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ పూర్తిస్థాయి అప్రమత్తతతో పనిచేస్తుందని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిసరాల్లో భద్రతను బలోపేతం చేయాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు. కలగకుండా చూడాలని, పెళ్లిళ్ల సమయంలో, ఆస్పత్రికి వెళ్లే వారి సమయంలో ఉదాసీనతతో వ్యవహరించాలని, నగదు, మద్యం పట్టుబడితే వీడియోగ్రఫీ ద్వారా చిత్రీకరించాలన్నారు . విధులను పారదర్శంగా నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి , గృహ నిర్మాణ సంస్థ పిడి రాజకుమార్, జెడ్పిసిఈఓ బి .శ్రీనివాసరావు, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు హాజరయ్యారు.

## వైనవంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



**చంపాపేట్, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆర్యవైశ్య సంఘం చంపాపేట్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా శ్రీ లక్ష్మీ గణపతి సమేత మూలమంత్ర హోమం నిర్వహించబడింది.ఈ వేడుకలో సంఘ గౌరవ అధ్యక్షుడు, వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథం సాయిరాం, ఎలకుర్తి జగన్, బెల్ద గురుమూర్తి, తోట యాదగిరి, ఊరే రవీందర్, సంఘ కార్యవర్గ సభ్యులు సోమ శ్రీనివాస్, ఊరే మధుసూదన్, చిగుల్లపల్లి మధు, మడిపడిగే శ్రీనివాస్, చిత్తనూరి నరేష్, మేధా వెంకటరమణయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.సంఘ అధ్యక్షుడు ఇడుకుళ్ళ విజయనాథ్ మాట్లాడుతూ అమ్మవారి కార్యక్రమంలో సభ్యులందరూ సమూహంగా పాల్గొని విజయవంతం చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి సంఘ కార్యక్రమంలో, అమ్మవారి పూజా కార్యక్రమంలో ఇలాగే సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి సభ్యుడికి అమ్మవారి కృపా కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

## భక్తి శ్రద్ధలతో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం





**ఆమనగల్లు, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో భక్తులు, భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన, హోమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు వీరబొమ్మ రామ్మోహన్, పాండయ్య,వాసు, నరసింహ, లక్ష్మయ్య, అర్చకులు ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## రఘుపతి పేట్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలి -సిపిఐ




**కల్వకుర్తి,జనవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** రఘుపతి పేట్ గ్రామాన్ని మండల కేంద్రంగా, కల్వకుర్తి నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని సిపిఐ నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు డిమాండ్ చేశారు. కల్వకుర్తి సిపిఐ కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రఘుపతి పేట్‌కు అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు పట్టించుకోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో సిపిఐ నాయకులు డాక్టర్ శ్రీనివాస్, ధార దాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే



**ఊరుకొండ, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఊరుకొండ మండలంలోని ఊరుకొండ పేటలో శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు కాయితి విజయకుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## నీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్ రాయికంటి బిక్షపతి





**కడ్తాల్,జనవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** కడ్తాల్ మండల కేంద్రంలోని రెండో వార్డులో తలెత్తిన నీటి సమస్యను స్థానిక సర్పంచ్ రాయికంటి బిక్షపతి వెంటనే పరిష్కరించారు.వాసులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా, మంగళవారం ఉదయం ఆయన వార్డు సభ్యుడితో కలిసి కాలనీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించారు. వెంటనే కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి పబ్లిక్ కొళాయి ఏర్పాటు చేయడం ద్వారా నీటి సమస్యను తీర్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో నీటి సమస్యలు, పారిశుద్ధ సమస్యలు ఉంటే గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావాలని సూచించారు.కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు జాంగిర్ బాబా, వార్డు సభ్యురాలు నూర్జాన్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వాసవి మాత ఆత్మార్పణమహోత్సవం



**కరీంనగర్, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విశ్వజనని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని గీత భక్త సమాజం సభ్యులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కరీంనగర్ బొమ్మకల్ పోలిమరాలోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో మంగళవారం ఉదయం శ్రీ వాసవాంబ స్తోత్ర పారాయణం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అధ్యక్షుడు బండ సత్తయ్య, కార్యదర్శి ఉప్పల రామేశం ఆధ్వర్యంలో నిర్వహించారు.

## నేడు మండల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**మనోహరాబాద్, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మనోహరాబాద్ మండలంలోని పలు ప్రాంతాల్లో ఈరోజు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు కాళ్లకల్ ఏఈ రాజ్ కుమార్ తెలిపారు. కొండాపూర్ పారిశ్రామిక వాడలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సరఫరా చేసే లైన్లు, టవర్లపై లైన్ లాగుట పనుల కారణంగా ఈరోజు మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయబడుతుంది అని ఈ సమయంలో కాళ్లకల్ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి, కొండాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ శిలాఫలకం ధ్వంసం



**పెద్దపల్లి ,జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : పెద్దపల్లి పట్టణంలోని 24, 25 వార్డుల పరిధిలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో స్థానిక ఎస్సీ కాలనీ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సామాజిక కార్యకర్త బొంకురి కైలాసం మాట్లాడుతూ, ఇది కుట్రపూరిత చర్య అని, నిందితులపై నాన్-బైలబుల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని, సమాజం మొత్తానికి ఉపయోగపడే ఆస్తులపై దాడులు చేయడం అమానుషమని ఆయన పేర్కొన్నారు.పోలీసులు వెంటనే విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు మరలా జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఎస్సీ కాలనీ వాసులు బొంకురి రమేష్, మాచర్ల రమేష్, అంతర్గం శ్రీనివాస్, మాచర్ల నర్సయ్య, కుక్క సుధాకర్, బొంకురి శ్రీధర్, మాచర్ల పోచాలు తదితరులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

# కార్పొరేషన్ అధ్యక్షుడు అంజన్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్లో భారీ చేరికలు




**కరీంనగర్, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ విజయనగర్ కాలనీకి చెందిన అబ్దుల్ హమీద్ నేడు దాదాపు వందమంది అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ చైర్మన్ మడుపు మోహన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.గత ఏడు సంవత్సరాలుగా విజయనగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, యువతను ఉపాధి వైపు నడిపించడం, క్రీడా స్ఫూర్తి నింపడం వంటి సేవలతో ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరుచుకున్న అబ్దుల్ హమీద్, కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితుడై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.అనంతరం ఆయన 34వ డివిజన్ నుండి కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం అంజన్ కుమార్‌కు దరఖాస్తు సమర్పించారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో అహ్మద్ మహమ్మద్, షేక్ మహమూద్, హఫీజ్ ముజ్జు, ఇర్షద్, యాకూబ్, ఖాజిం, సుమీర్, ముజాహిద్, రవూఫ్, తాజ్, ఆన్సర్, ఒజామా, అపర్ణ, సంతోష్, వెంకటేష్, రాజు, రాజయ్య తదితరులు ఉన్నారు.

# ఎమ్మార్వో అక్రమాలపై కలెక్టర్కు ఫిర్యాదు

**హుస్నాబాద్, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ ఎమ్మార్వో లక్ష్మారెడ్డి అవినీతి, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడి తన భూమిని అన్యాక్రాంతం చేసేందుకు సహకరించాడని రిటైర్డ్ టీచర్ ఏ. ధర్మారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ధర్మారెడ్డి వివరాల ప్రకారం, ఎల్లమ్మ గుడి సమీపంలోని సర్వే నంబర్ 554/దీ1లో 50 సంవత్సరాల క్రితం తాను 20 గుంటల భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేశారని, తన పేరుపై పాస్‌బుక్ కూడా ఉందని తెలిపారు. సుమారు 20 సంవత్సరాల క్రితం తన మనుమడు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడానికి ఒక గుంట భూమి ఇవ్వడానికి అంగీకరించినప్పటికీ, తనకు తెలియకుండా ఐదు గుంటల భూమిని దొంగ రిజిస్ట్రేషన్ ద్వారా నమోదు చేశారని ఆయన ఆరోపించారు.ఈ విషయాన్ని ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లగా, మొదట స్లాట్ బుకింగ్ రద్దు చేస్తామని చెప్పి, తరువాత అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయకుండా నిర్లక్ష్యం వహించారని ధర్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూమి కింద వాటర్ ప్లాంట్, నివాస భవనాన్ని రిజిస్ట్రేషన్ చేసి భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.తన వద్ద పూర్తి చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ, సుమారు రూ.50 లక్షల విలువైన భూమిని అన్యాక్రాంతం చేయడానికి ఎమ్మార్వో సహకరిస్తున్నారని, ప్రస్తుతం తన భూమిని విక్రయించుకునేందుకు కూడా అడ్డుపడుతున్నారని వాపోయారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ఎమ్మార్వో లక్ష్మారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ధర్మారెడ్డి కోరారు. భూ కబ్జాలు, నకిలీ రిజిస్ట్రేషన్లకు పాల్పడే అధికారులపై కఠిన శిక్షలు విధించాలని ఆయన డిమాండ్ చేశారు.

# నితిన్ నబీన్ ఎన్నికపై హుస్నాబాద్లో కార్యకర్తల సంబురాలు

**హుస్నాబాద్, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఎన్నికైన సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలో సంబురాలు జరిగాయి. పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శంకర్ బాబు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా అవతరించిన బీజేపీలో సంస్థాగత ఎన్నికలు జరుగుతున్న క్రమంలో నితిన్ నబీన్‌ను జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం శుభసూచకమని అన్నారు. యువతకు ప్రాధాన్యం ఇస్తూ 45 ఏళ్ల నాయకుడికి పార్టీ పగ్గాలు అప్పగించడం బీజేపీకి శుభ పరిణామమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో



దేశం అభివృద్ధి బాట పట్టిందని, ప్రజలు సురక్షితంగా జీవిస్తున్నారని తెలిపారు. రాబోయే హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పట్టణాలకు నిధులు మంజూరు అవుతాయని, అభివృద్ధి బీజేపీ ద్వారానే సాధ్యమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల నాగార్జున్, బోడిగే వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పోలోజు రాజేందర్ చారీ, కార్యదర్శి బొప్పిశెట్టి సాయిరామ్, కోశాధికారి బుర్ర రాజు, కిసాన్ సంఘ్ ఇన్చార్జి కవ్వ వేణు గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు బొనగిరి రవి, కాయిత అరుణ్ రెడ్డి, కాదాసు నర్సయ్య, ఆశాడపు శ్రీనివాస్, మహిళా మోర్చా నాయకురాలు లకవత్ శారద, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరం

**హుస్నాబాద్ ,జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు, గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు షుగర్, బీపీ, మహిళల ఆరోగ్య పరీక్షలు, చిన్నపిల్లల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సులు, ఆరోగ్య సిబ్బంది శ్రద్ధగా పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచిత మందులు అందించారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించే సూచనలు కూడా ఇచ్చారు. ప్రత్యేకంగా వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, పేద కుటుంబాలు ఈ



శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. గ్రామంలో ఇలాంటి శిబిరం నిర్వహించడంతో ఆసుపత్రులకు వెళ్లే ఖర్చు, సమయం ఆదా అయిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడానికి డా. లక్ష్మి ప్రసన్న, ఏఎన్ఎంఎస్ ధనలక్ష్మి, స్వరూప, వార్డు సభ్యులు కొత్త మధు, కనవేణి రజినికాంత్, కోల రజిత, ఆశా వర్కర్లు సంధ్య, సుజాత, సుగుణ, గ్రామ ప్రజాప్రతినిధులు సహకరించారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాల్లో ఇది ఒక ముఖ్యమైన అడుగుగా ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# పురపాలక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

## - రాష్ట్ర ఎన్నికల సంఘం


**పెద్దపల్లి, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అవసరమైన ఏర్పాట్లు చేసి సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని సూచించారు.మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించిన ఆమె, ఎన్నికల షెడ్యూల్ త్వరలో విడుదల కానుందని, షెడ్యూల్ రాగానే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, పోలింగ్, కౌంటింగ్ వంటి అన్ని కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా సిద్ధం చేసుకోవాలని అధికారులకు ఆదేశించారు.క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో భద్రతా సిబ్బందిని నియమించాలని,





ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్‌కాస్టింగ్ సౌకర్యం, సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆమె పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సోషల్ ఎలిమెంట్స్‌పై బైండోవర్ చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మేర డ్రోన్ వినియోగం కూడా ఉండాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓటర్ జాబితా ప్రచురణ పూర్తయిందని, పోలింగ్ కేంద్రాల వారీగా వసతుల వివరాలు నమోదు చేశామని తెలిపారు. పోలింగ్ బాక్సులు, సిబ్బంది, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు సిద్ధంగా ఉన్నారని, ప్రతి కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరా ఏర్పాటు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను గుర్తించామని, బ్యాలెట్ పత్రాల ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్ గుర్తింపు కూడా పూర్తయిందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మిక సంఘంనూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**వర్ధన్నపేట, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్లు గీత కార్మిక సంఘం వర్ధన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో కల్లుగీతా కార్మిక సంఘం నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు.మంగళవారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ శివారులోని గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయంలో కల్లుగీతా కార్మిక సంఘం వర్ధన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేజీకేఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు నర్సయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వీరస్వామి గౌడ్, గౌరవ అధ్యక్షులు పులి సోమయ్య గౌడ్, జిల్లా గౌరవ సలహాదారులు సట్ల సూర్యయ్య గౌడ్, పర్వతగిరి మండల అధ్యక్షులు సతీష్ గౌడ్, రాయపర్తి మండల అధ్యక్షులు సంపత్ గౌడ్ హాజరై ముందుగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వర్ధన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన



2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వీరస్వామి గౌడ్,జిల్లా గౌరవ సలహాదారులు, వర్ధన్నపేట మండల ప్రధాన కార్యదర్శి సట్ల సూర్యయ్య గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కల్లుగీత కార్మికులకు రూ.4 వేలు పింఛన్, ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచాలన్నారు. పెండింగ్‌లో



ఉన్న గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా డబ్బులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కల్లుగీత వృత్తి చేసే వారందరికీ కాటమయ్య రక్షణ కిట్లు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల అధ్యక్షులు జనగాం యాకయ్య గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సట్ల సూర్య గౌడ్,గౌరవ అధ్యక్షులు సుదగాని లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యక్షులు మెరుగు రాజయ్య గౌడ్, మండల సహాయ కార్యదర్శిలు బుర్ర అశోక్ గౌడ్, మడత ప్రశాంత్ గౌడ్, కార్యవర్గ సభ్యులు మడ్డి సుధాకర్ గౌడ్, బూర సంపత్ గౌడ్, సట్ల వెంకటరావు నరసయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నిబంధనలతోనే
# ప్రమాదాలకు చెక్

**సీపీ గౌష్ ఆలం**




**కరీంనగర్ ,జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లో నిర్వహించిన అరైవ్ అలైవ్ అవగాహనా కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల చర్యలతో సాధ్యం కాదని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి వాటిని కచ్చితంగా పాటించినప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని అన్నారు.గత ఏడాది కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల వల్ల 200 మంది ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగించిందని ఆయన పేర్కొన్నారు. వీటిలో ఎక్కువ శాతం సీట్‌బెల్ట్, హెల్మెట్ వినియోగం లేకపోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి మానవ తప్పిదాల వల్లే జరిగాయని తెలిపారు. ప్రమాదాల్లో 85 శాతం బాధితులు పురుషులే కావడం గమనార్హమని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కరీంనగర్ నుండి హైదరాబాద్, వరంగల్, జగిత్యాల, సిరిసిల్ల, చొప్పదండి వెళ్లే రహదారుల్లో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న బ్లాక్ స్పాట్లను గుర్తించి, అక్కడ ప్రత్యేక నిఘా, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర డీజీపీ ప్రారంభించిన అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తూ, ప్రతి ఒక్కరూ పరిసరాలను గమనిస్తూ వాహనం నడిపే డిఫెన్సివ్ డ్రైవింగ్ అ ల వ ం´ చ´ ు కో ఎా ల ని సూచించారు.విద్యార్థులను ఉద్దేశించి సీపీ తన విద్యార్థి దశలో ఎదుర్కొన్న అనుభవాలను ఉదాహరణగా చెబుతూ రోడ్డు భద్రత ప్రాముఖ్యతను వివరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరితో రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, డిటివో శ్రీకాంత్ చక్రవర్తి, ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరి స్వామి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరాస్వామి, డాక్టర్ సాయిదీప్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నీలం సంపత్, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయానికి ఎంపీ నిధుల మంజూరు



**కరీంనగర్ ,జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధుల నుండి వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలోని కళ్యాణ మండపం డైనింగ్ హాల్ ఫ్లోరింగ్ కోసం ఐదు లక్షల రూపాయలు మంజూరు చేశారు. నిన్న కాంట్రాక్టర్ సురేందర్ పనులను ప్రారంభించారు.వాసవి మాత జయంతి వేడుకలకు ఆహ్వానించడానికి వెళ్లిన సమయంలో బండి సంజయ్ ఈ నిధులను సాంక్షన్ చేస్తానని తెలియజేసి, పనులు ప్రారంభించిన సందర్భంగా ఆలయ ట్రస్ట్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాచం రాజేశ్వర్, కోశాధికారి బొల్లం శ్రీనివాస్, సంకష్ట కన్వీనర్ రాచమల్ల భద్రయ్య, సేవా కన్వీనర్ తాటిపల్లి సుభాష్, డైరెక్టర్లు పల్లెర్ల వేణు, పల్లెర్ల కిరణ్, కట్కూరి వేణు, మల్లికార్జున్, తోడుపునూరి తిరుపతి, పడమటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కన్నా కృష్ణ, యువజన సంఘం అధ్యక్షుడు జిడిగె సాయికృష్ణ, వైశ్య సేవా కేంద్రం డైరెక్టర్లు కైలాస్ నవీన్, రామిడి శ్రీధర్ కూడా హాజరయ్యారు.

# అభివృద్ధి నిరోధకంగా మారుతున్న కాంగ్రెస్

**-సింగిరెడ్డి కృష్ణారెడ్డి**




**గంగాధర, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, పేదలకు ఉపాధి హామీ పనిని 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచే విబిజీ రాంజీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం పేదల అభివృద్ధికి నిరోధకంగా మారిందని విమర్శించారు. చొప్పదండి మండలంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదలకు బయోమెట్రిక్ అటెండెన్స్ ద్వారా కూలీని 15 రోజుల్లో అందేలా చేసి, జీవన ప్రమాణాలను పెంచేలా బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం 20042014 మధ్య కేవలం లక్ష తొంభై వేల కోట్లు కేటాయించగా, నరేంద్ర మోదీ సర్కార్ 20142024 మధ్య 8 లక్షల కోట్ల రూపాయలు ఉపాధి హామీపై ఖర్చు పెట్టిందని ఆయన వివరించారు.విబిజీ రాంజీ చట్టంతో ఉపాధి హామీ పథకానికి ఏటా 86 వేల కోట్లకు బదులుగా 1.5 లక్షల కోట్ల రూపాయలు నిధులు పెంచారని, తెలంగాణకు కూడా 340 కోట్లు అదనంగా కేటాయించనున్నారని తెలిపారు. ఈ చట్టం వల్ల గ్రామీణ కూలీలకు ఉపాధి లభించడంతోపాటు ఆదాయం పెరుగుతుందని, గ్రామాల్లో మౌలిక వసతులు, నీటి నిల్వలు పెరిగి భూగర్భ జలాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. దేశమంతా ఈ కార్యక్రమాన్ని సమర్థిస్తుంటే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం శోచనీయమని ఆయన అన్నారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపిటిసిలు గొల్ల గట్టయ్య, తోట కోటేష్, ఉపసర్పంచ్ బాలు, మాజీ ఉపసర్పంచ్‌లు అంజయ్య, కిట్టు గౌడ్, అంజయ్య, మధుసూదన్ రెడ్డి, రమేష్, సురేష్, సతీష్, రవి, శ్రీనివాస్, దుశాంత్ రెడ్డి, శేఖర్, వెంకటరమణ, వెంకటేష్, వేణు, కనకయ్య, రాజకుమార్ రెడ్డి, శంకర్, లచ్చయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఏడుగురిపై రౌడీ షీట్లు




**కరీంనగర్ ,జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా గత నేర చరిత్రను పరిశీలించి నేర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఏడుగురిపై రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.బొమ్మకల్ గ్రామానికి చెందిన ఏదేల్లి సతీష్, కాల్వ సతీష్, తీగలగుట్టపల్లి గ్రామానికి చెందిన మొహమ్మద్ ముస్తాక్, ఫకీర్‌పేటకు చెందిన అడప వంశీ, రామగుండం ప్రాంతానికి చెందిన తుండ్ల సాయి వర్షిత్, కొండమీదీ సాయి కార్తిక్, మారుతీనగర్‌కు చెందిన ముత్తోజు సాయి తేజ గతంలో పలు నేరాలకు పాల్పడి ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారని గుర్తించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ఇకపై వారి కదలికలను కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తామని, మళ్లీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు నేర సంబంధిత సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. గంజాయి, మత్తుపదార్థాల వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, స్త్రీలతో అసభ్యకర ప్రవర్తన, అక్రమ ఇసుక రవాణా, దొంగ పత్రాలు సృష్టించి భూకబ్జాలు, జూదం, సైబర్ నేరాలు, సోషల్ మీడియాలో నగ్న ఫోటోలు మార్ఫింగ్ చేయడం, మతవిద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని, మరల నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

# రంజాన్ మాసం ప్రశాంతంగా జరగాలి

**అదనపు కలెక్టర్ డి. వేణు**



**పెద్దపల్లి ,జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంజాన్ మాసం ప్రశాంతంగా జరగడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణు సూచించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఆర్డీఓ బి. గంగయ్య, సురేశ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మసీదులు, ఈద్గాలు, కబ్రిస్తాన్ల వద్ద పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, త్రాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆయన పేర్కొన్నారు.పండగ సందర్భంగా మార్కెట్లలో పెద్ద సంఖ్యలో మహిళలు షాపింగ్‌కు వచ్చే అవకాశం ఉన్నందున భద్రతా ఏర్పాట్లు చేయాలని, మసీదుల వద్ద పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మసీదు పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మసీదు సమీపంలో దేవాలయాలు ఉన్నచోట సామరస్య వాతావరణం కొనసాగేందుకు పటిష్ట భద్రత కల్పించాలని ఆయన అన్నారు.అనంతరం తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల 20262027 ప్రవేశాల పోస్టర్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పి. నరేష్ కుమార్, తహసిల్దార్ రాజ్ కుమార్, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ సన ఫక్రుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో అవకాశం




**కరీంనగర్ రూరల్ ,జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
69వ ఎస్.జి.ఎఫ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ అండర్14 విభాగంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్ గెలుచుకుంది. బాలుర విభాగంలో కూడా అండర్14 జట్టు తృతీయ స్థానం సాధించింది.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన నగునూరు పాఠశాల విద్యార్థులు కుక్కల అనేహా మరియు ఉప్పుమల్ల ప్రణీత్ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. రవీందర్, సీనియర్ ఉపాధ్యాయుడు తిరుపతి రావు, ఉపాధ్యాయ బృందం అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవ
# రోజున ప్రత్యేక కార్యక్రమాలు




**కరీంనగర్, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:కరీంనగర్‌లోని శ్రీ కన్యాకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి మాత ఆత్మార్పణ రోజు సందర్భంగా వాసవి వనిత ఏంజిల్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి జీవిత చరిత్రను ప్రజలకు తెలియజేయడానికి బ్యానర్ ఏర్పాటు చేసి, గోమాతకు పూజలు నిర్వహించారు. హోమంలో భక్తులు పాల్గొని అమ్మవారికి ఓడిబియ్యం, చీర, సారె సమర్పించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు పులిహోర, సిరా ప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాచమల్ల గాయత్రి, జంధ్యం మాధవి, పబ్బ అరుణతో పాటు క్లబ్ అధ్యక్షురాలు రాయకంటి భాగ్యలక్ష్మి, కార్యదర్శి పల్లెర్ల విద్య, కోశాధికారి గుండా శ్రీదేవి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశం



**కరీంనగర్, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశా ఫెసిలిటేటర్స్‌తో కార్యాలయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణీలను సాధారణ ప్రసవాలకు ప్రోత్సహించాలని, గర్భధారణ సమయంలో సమస్యలు ఉంటే గైనకాలజీ నిపుణుల ద్వారా పూర్తి చికిత్స అందించాలని సూచించారు. ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని, 30 ఏళు పైబడిన వారందరికీ రక్తపోటు, షుగర్ పరీక్షలు చేసి, నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులు అందించాలని అన్నారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి జిల్లా పోషకాహార పునరావాస కేంద్రానికి పంపేందుకు ఆర్‌బీఎస్‌కే, 102 వాహనాలను వినియోగించాలని సూచించారు. సూపర్వైజర్ సిబ్బంది ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ సన జవేరియా, విమల, రవీంద్రరెడ్డి, ఆశా ఫెసిలిటేటర్స్ పాల్గొన్నారు.


# గణతంత్ర దినోత్సవానికి ఘనమైన ఏర్పాట్లు




**కరీంనగర్ ,జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జిల్లా కేంద్రంలో ఈనెల 26న జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ కవాతు మైదానంలో జరిగే వేడుకలకు స్టేజీ, పార్కింగ్, విద్యుత్, అలంకరణ, సౌండ్ వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు తాగునీరు అందుబాటులో ఉంచాలని, విద్యుత్, ఫైర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, చిన్నారులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా చూడాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్లు ఏర్పాటు చేయాలని, 108, 102, బాల రక్షక్, సఖి వాహనాలను ప్రదర్శనలో ఉంచాలని తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ఇవ్వడానికి సంబంధిత శాఖలు నివేదికలు పంపాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని, బందోబస్తుతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అంకిరోనిపల్లిలో హెల్త్ క్యాంప్ ప్రారంభం



**అమ్రాబాద్ ,జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అచ్చంపేట మండలం అంకిరోనిపల్లి గ్రామంలో యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కల్పన సతీష్, మంగ్య నాయక్, బీజేపీ సీనియర్ నాయకుడు మధునాగుల మహేందర్, శంకర్ మాదిగ, రామోజీ, పత్య నాయక్, శ్రీను నాయక్‌తో పాటు మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు భూమి పూజ

## - ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**కరీంనగర్, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ నగరంలోని 51వ డివిజన్‌లో రామాలయం నుండి వావిలాలపల్లి చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణానికి 15 లక్షల రూపాయల నిధులతో భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై పనులను ప్రారంభించారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ మేచినేని అశోక్ రావుతో పాటు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ, గతంలో సీఎం అస్యూరెన్స్ నిధులతో కరీంనగర్ నగరాన్ని అభివృద్ధి చేశామని, స్మార్ట్ సిటీ ద్వారా మరింత అభివృద్ధి సాధించామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా నగరానికి ఒక్క పైసా కూడా తీసుకురాలేదని విమర్శించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్ రావు, కర్ర సూర్య శేఖర్, డివిజన్ నాయకులు మల్లారెడ్డి, శేఖర్, చందు, బండారు ఆంజనేయులు, మధుకర్ పటేల్, దేవేందర్, ఆనందరావు, అంజన్ రావు, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, మిడిదొడ్డి నవీన్, కిరణ్, పవన్, ములుకుంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం కాంగ్రెస్, బీజేపీలు ఏమీ చేయలేదని టిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేక ఆయా పార్టీల నాయకులు కండువాలు పట్టుకొని తిరుగుతున్నారని విమర్శించారు. టిఆర్ఎస్ హయాంలోనే కరీంనగర్ సుందర నగరంగా అభివృద్ధి చెందిందని, డంప్‌యార్డు తరలింపుకు 100 కోట్లు తెచ్చిన తర్వాతే బీజేపీ పోటీ చేయాలని అన్నారు. బండి సంజయ్ నగర అభివృద్ధికి ఏం చేశారో చెప్పిన తర్వాతే ఓట్లు అడగాలని సవాలు చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో మాజీ కార్పొరేటర్ దిండిగాల మహేష్, ఖర్చు రవి, నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు షౌకత్, యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, నగర బిఆర్ఎస్ అధ్యక్షుడు బొంకురి మోహన్, డివిజన్ అధ్యక్షులు ఆర్య రవి గౌడ్, తొంటి రాజేందర్, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి, జల్లోజి శ్రీనివాస్, నాగుల కిరణ్ కుమార్, మహిళ అధ్యక్షురాలు పూరేళ్ల సరోజ, వడ్నాల రాజు, సుంకిశాల సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రోడ్డు భద్రతా సందర్భంగా ఉచిత కంటి తనిఖీ శిబిరం

**కరీంనగర్ ,జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: 37వ జాతీయ రోడ్డు భద్రతా సంవత్సరం2026 సందర్భంగా కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద ఉచిత కంటి తనిఖీ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐ వై ఎస్ ఓ టీం ఇండియా, యాంటీ కరప్షన్ టీం ఇండియా, సేఫర్ ఇండియన్ రోడ్స్, యంగ్ ఇండియా మిషన్, కరీంనగర్ సైకిల్ క్లబ్ సభ్యులు ట్రాఫిక్ పోలీస్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, సాయి శ్రీనివాస్ ఐ హాస్పిటల్ సమన్వయంతో ఏర్పాటు చేశారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శిబిరాన్ని ప్రారంభించి, ఆటో డ్రైవర్లు మరియు వాహనదారులు స్పష్టమైన దృష్టి కోసం క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డ్రైవింగ్




సమయంలో కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వైద్యులు, బృందం స్వచ్ఛందంగా మద్దతు ఇచ్చినందుకు ఆయన అభినందించారు. ఈ శిబిరాన్ని విజయవంతం చేయడానికి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, శ్రీ సాయి ఐ హాస్పిటల్ డాక్టర్ రఘు ప్రత్యేక సహకారం అందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ బండారి యాదగిరి స్వామి, డాక్టర్ మహమ్మద్ హరిస్, డాక్టర్ అనిఅనిరుధ్ రావ్, ఎస్ హెచ్ ఓలు కరీం ఉల్లాఖాన్, పర్సా రమేష్, ఆర్ఎస్ఐ ప్రసాద్, సేఫ్ ఇండియన్ రోడ్స్ వైస్ ప్రెసిడెంట్ బలరామ్ విశ్వనాథ్, ఐ వై ఎస్ ఓ సీఈఓ ఘన్‌షమ్ ఓజా, జనరల్ సెక్రటరీ అన్మోల్ ఓజా, యంగ్ ఇండియా మిషన్ ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# గొల్ల కేతమ్మ పేరును వక్రీకరించడంపై యాదవుల ఆగ్రహం



**గన్నేరువరం, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

: గన్నేరువరం మండలంలో యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మైలారం మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద యాదవులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన కళ్యాణ మహోత్సవంలో అర్చకులు, చైర్మన్ చేసిన తప్పిదంతో యాదవుల కులదైవం శ్రీ గొల్ల కేతమ్మ పేరును వక్రీకరించి కేతకిగా పేర్కొనడం యాదవుల ఆగ్రహానికి కారణమైంది. జిల్లా అధ్యక్షుడు బండి మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ ఇటువంటి తప్పిదం మళ్లీ జరగకుండా చూడాలని హెచ్చరించారు. అర్చకుల వద్ద క్షమాపణ చెప్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి గాజనమేన శ్యామ్ కుమార్ యాదవ్, చిట్టవేణి వెంకటేష్ యాదవ్, అంగమల్లయ్య యాదవ్, నాగరాజు యాదవ్, అల్స హరీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి మాత ఆత్మార్పణ పూజ



**కొత్తపేట, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కొత్తపేట డివిజన్ కమర్షియల్ ట్యాక్స్ కాలనీ, న్యూ నాగోల్‌లో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాత ఆత్మార్పణ పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి జాతీయ నాయకుడు పేరాల శేఖర్, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్, చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నరసింహాగుప్త ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్పొరేటర్ మాట్లాడుతూ వాసవి మాత త్యాగం, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, సమాజ ఐక్యత, ధర్మనిష్ఠ, సేవా కార్యక్రమాల ప్రాధాన్యతను గుర్తుచేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

# పాంగాంగ్ సరస్సుకు సరికొత్త అతిథులు



**న్యూఢిల్లీ -జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం కాంగ్రాలోని పాంగాంగ్ సరస్సు ఏటా వలస పక్షులతో కళకళలాడుతుంది. సైబీరియాకు చెందిన బార్-హెడెడ్ గూస్ పక్షులు ప్రతి ఏడాది శీతాకాలంలో ఇక్కడ పక్షి ప్రేమికులకు కనువిందు చేస్తాయి. అయితే ఈసారి గూస్ బర్డ్స్‌తోపాటు రెండు అరుదైన జాతుల పక్షులు ఇక్కడ దర్శనమిచ్చాయి.పక్షి ప్రేమికులు వాటిని చూసి ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. వాటి గురించి వన్యప్రాణి సంరక్షణ అధికారులకు సమాచారం అందించారు. అయితే ఆ పక్షులు ఏ జాతికి చెందినవి..? ఎక్కడి నుంచి వలస వచ్చాయి..? అనే వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు చెప్పారు. ఈ రెండు రకాల పక్షులు పాంగాంగ్ సరస్సుకు రావడం ఇదే తొలిసారని తెలిపారు.

# వందే భారత్ స్లీపర్ ఫుడ్ మెనూ ఇదే..



**న్యూఢిల్లీ -జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
దేశంలోని మొట్టమొదటి వందేభారత్ స్లీపర్ రైలు ప్రజలకు అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. హౌరా-గౌహతి మధ్య తొలి స్లీపర్ రైలును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు పట్టాలెక్కినప్పటి నుంచి దీని గురించే విపరీతంగా చర్చ నడుస్తోంది. రైలు ఫీచర్స్ వంటి వాటి గురించి నెటిజన్లు మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో ఈ రైల్లో ప్రయాణికులకు అందించే ఫుడ్ మెనూ నెట్టింట వైరల్ అవుతోంది.వందే భారత్‌లో ప్రయాణించే ప్రయాణికుల కోసం ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ సహకారంతో గౌహతిలోని మేఫెయిర్ స్ప్రింగ్ వ్యాలీ రిసార్ట్.. బెంగాలీ, అస్సాం సంప్రదాయ వంటకాలతో ప్రత్యేకంగా మెనూను రూపొందించింది. ఈ మెనూలో బెంగాలీ స్పెషల్ డిషెస్ అయిన బాసంతి పులావ్, ఛోలార్ దాల్, మూంగ్ దాల్, ధోకర్ వంటి సంప్రదాయ వంటకాలు ఉన్నాయి. వీటితోపాటూ అస్సాం పాక సంప్రదాయాలను ప్రతిబింబించేలా జోహా రైస్, మతి మోహోర్, మసూర్ దాల్, సీజనల్ వెజిటబుల్ ఫ్రైస్‌ను జతచేశారు. ఇక స్వీట్స్‌లో సందేశ్, నారికోల్ బర్ఫీ, రసగుల్లాలను చేర్చారు. వీటన్నింటినీ మీడియం స్పైస్‌తో ప్రయాణికులు తినేవిధంగా తయారు చేసి అందిస్తున్నారు.

# విమాన భద్రతకు ప్రత్యేక విభాగం

## విమానయాన సంస్థలకు డిజిసిఏ ఆదేశం




**చెన్నై న్యూఢిల్లీ జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
ప్రమాదాలు నివారించడానికి సమర్థమైన సిబ్బందితో విమాన భద్రత వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక నిర్దిష్టమైన భద్రతా విభాగాన్ని ఏర్పాటు చేయాలని పౌర విమానయాన సంస్థలను డైరక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఏ) ఆదేశించింది. ఈ విభాగ అధిపతిగా 'చీఫ్ ఆఫ్ ఫ్లైట్ సేఫ్టీ', 'డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఫ్లైట్ సేఫ్టీ'ని నియమించాలని పేర్కొంది. చీఫ్ ఆఫ్ ఫ్లైట్ సేఫ్టీ ఒక పైలట్ ఉంటే, డిప్యూటీ ఒక ఇంజనీర్ ఉండాలని సూచించింది. విమాన ప్రమాదాలపై జరుగుతున్న విచారణలు విమానయానాల్లో పునరావృతమవుతున్న వ్యవస్థాగత లోపాలను పదేపదే ప్రస్తావిస్తుండటంతో ఇలాంటి పోస్టుల భర్తీ అవసరమయిందని డిజిసిఏ తెలిపింది.

# వాసవి కన్యకాపరమేశ్వరి మాత ఆత్మార్పణ దినోత్సవము లో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త

**ఎల్బీనగర్ జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
శ్రీ ఆర్యవైశ్య వాసవి మాత సేవా సమితి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం దగ్గర, న్యూ నాగోల్, కొత్తపేట్ లో జరిగిన ఆర్యవైశ్య వాసవి కన్యకాపరమేశ్వరి మాత ఆత్మార్పణ దినోత్సవము లో పాల్గొనడం జరిగింది. మరియు శ్రీవాసవి మాత సేవా సమితి న్యూ నాగోల్, కొత్తపేట్ డివిజన్ ఆధ్వర్యంలో కమర్షియల్ టాక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ కమర్షియల్ టాక్స్ కాలని, మోహన్ నగర్, కొత్తపేట్ లో జరిగిన వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవము సందర్భముగా పంచామృతం తో అభిషేకము లో పాల్గొన్న బ్రాజజ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి ఆశీర్వచనాలు అందుకున్నారు అని ఆయన అన్నారు. వాసవి మాత ఆశీస్సులతో సమాజంలో




ఐక్యత, సేవాభావం పెంపొందాలని ఆకాంక్షించారు. వాసవి మాత చరిత్ర, ఆర్యవైశ్యుల సేవాభావం, సమాజాభివృద్ధిలో వారి పాత్ర గురించి ప్రసంగించారు. సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలంటూ నిర్వాహకులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గరపూ దయానంద్ గుప్త యర్రమల్ల శ్రవణ్ కుమార్ అధ్యక్షులు శ్రీ ఆర్యవైశ్య వాసవి మాత సేవా సమితి అలాగే తేలుకుంట్ల సుధాకర్ , చీఫ్ అడ్వైజర్ మంచుకొండ సురేందర్ , చీఫ్ అడ్వైజర్ బి. రమేష్ , (పీఆర్వో) అడ్వైజర్ బలుసాని కుమార స్వామి , అధ్యక్షులు గుండా రామకోటేశ్వర రావు, శ్రీ వాసవి మాత సేవా సమితి కొత్త పేట అలాగే ఉపాధ్యక్షులు పబ్బ కృష్ణమూర్తి ,
ప్రధాన కార్యదర్శి మోట్కురి రమేష్ , సంయుక్త కార్యదర్శి కొండూరు వెంకటరమణ , మారం నగేష్ , వీసంశెట్టి మురళీశేఖర్ , కోశాధికారి కార్య నిర్వహక కార్యదర్శి గుండా చంద్రశేఖర్ , పోలా వంశీకృష్ణ , నల్లపాటి కళ్యాణ్ గుప్త ,సాంస్కృతిక కార్యదర్శి మహంకాళి మల్లిఖార్జన గుప్త , అతిమాముల ప్రేమ కు , కారంశెట్టి నవీన్ కుమార్ , ఆర్య వైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మూలో ఉగ్రవాదుల రహస్య స్థావరం గుర్తింపు..

## వంట సామాగ్రి లభ్యం

**న్యూఢిల్లీ -జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
జమ్మూ-కాశ్మీర్ ప్రాంతంలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని (బంకర్) భద్రతా దళాలు గుర్తించాయి. అక్కడి నుంచి ఆహార పదార్థాల్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బంకర్ పాకిస్తాన్ కేంద్రంగా నడిచే జైషే మహ్మద్ సంస్థదిగా భద్రతా దళాలు భావిస్తున్నాయి. జమ్ము-కాశ్మీర్, కిష్త్వార్ జిల్లాలోని 12,000 అడుగుల ఎత్తున్న ప్రాంతంలో భారత భద్రతా దళాలు తీవ్రవాదుల రహస్య స్థావరాన్ని గుర్తించాయి.జైషే మహ్మద్ సంస్థకు చెందినదిగా భావిస్తున్న ఈ ప్రదేశంలో వారు చాలాకాలంపాటు తలదాచుకోవడానికి కావాల్సిన సరుకుల్ని నిల్వ చేసుకున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా చలికాలం



మనుగడ సాగించే ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ ప్రదేశంలో 50 మ్యాగీ నూడిల్స్ ప్యాకెట్లు, 20 కేజీల బాస్మతి రైస్, మసాలాలు, తాజా కూరగాయలు, వంట గ్యాస్, కలప వంటివి ఉన్నాయి. వీటిని భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కాశ్మీర్ ప్రాంతంలో చలికాలం అత్యంత స్వల్ప స్థాయిలో ఉష్ణోగ్రతలుంటాయి. మంచు కూడా భారీ స్థాయిలో కురుస్తుంది. అందుకే ఈ వాతావరణానికి అనుగుణంగా ఉగ్రవాదులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ బంకర్ నిర్మాణం రాళ్లతో కట్టిన గోడలతో కార్గిల్ స్టైల్ లో ఉంది. అలాగే పూర్తి నిఘా ఉండేలా ఏర్పాట్లున్నాయి. అంటే ఎవరైనా అక్కడికి వస్తే మరోవైపు నుంచి పారిపోవచ్చు. ఈ నిర్మాణం, సామగ్రికి సంబంధించి కచ్చితంగా స్థానికుల సహకారం ఉంటుందని సెక్యూరిటీ సిబ్బంది అనుమానిస్తున్నారు. పాక్ ఉగ్రవాది, జైషే మహ్మద్ కమాండర్ సైఫుల్లా, డిప్యూటీ కమాండర్ అదిల్ ఈ స్థావరాన్ని వాడుకుంటున్నట్లు భావిస్తున్నారు. స్థానిక సోనార్ గ్రామం, మండ్రల్ సింగ్ పోరా ప్రాంతంలో ఆదివారం పోలీసులు యాంటీ టెర్రర్ ఆపరేషన్ చేపట్టగా.. ఈ బంకర్ను గుర్తించారు. ఇదే సమయంలో ఇక్కడ ఉగ్రవాదులకు, భద్రతా దళాలకు మధ్య జరిగిన కాల్పుల్లో ఎనిమిది సిబ్బంది గాయపడగా, ఒకరు మరణించారు.

# నాసిక్‌లో రైతు సంఘటిత సాగు నమూనాలపై రైతు కమిషన్ అధ్యయనం





మొదటి తరువాయి
రైతు నిర్వహిస్తున్న డ్రైయర్ యూనిట్‌ను కూడా కమిషన్ సందర్శించింది. ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పథకం కింద గిరిజన రైతు సచిన్ ఈ డ్రైయర్ యూనిట్‌ను నిర్వహిస్తున్నాడు. ఈ యూనిట్ ద్వారా తాను లాభాలు పొందుతున్నట్లు, యూనిట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తున్నట్లు కమిషన్‌కు వివరించాడు.చుట్టుపక్కల ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల ద్రాక్ష తోటలను కూడా కమిషన్ పరిశీలించింది. వర్షపు నీటిని నిల్వ చేసుకుని సాగుకు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్న ఆధునిక నీటి నిర్వహణ పద్ధతులపై సహ్యాద్రి ఫార్మ్స్ ప్రతినిధులు వివరించారు. రైతులు సంఘటితంగా సాగు చేస్తే అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధ్యమవుతుందని కమిషన్ ఈ సందర్భంగా స్పష్టం చేసింది.రైతులు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్పీవో)గా ఏర్పడి సాగు చేస్తూ, తమ పంటలను తగిన ధరలకు కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేసి ఎగుమతి చేస్తున్న విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిషన్‌కు వివరించారు. 2011లో కేవలం 204 మంది రైతులతో ప్రారంభమైన సహ్యాద్రి ఫార్మ్స్, నేడు 24 వేల మంది రైతుల వరకు విస్తరించిందని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఎఫ్పీవో దాదాపు రూ.2 వేల కోట్ల టర్నోవర్‌ను అధిగమించిందని కమిషన్‌కు వివరించారు.ఈ సందర్భంగా రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కమిషన్ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ రైతు అనుకూల సాగు నమూనాలపై అధ్యయనం చేస్తోందన్నారు. ఇప్పటికే కేరళ, హర్యానా రాష్ట్రాల్లో పర్యటించిన కమిషన్, నేడు మహారాష్ట్రలోని నాసిక్ పర్యటనకు వచ్చిందన్నారు. తక్కువ విస్తీర్ణంలో, తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో అధిక దిగుబడి, అధిక లాభాలు సాధించే విధానాలపై కమిషన్ లోతైన పరిశీలన చేస్తోందన్నారు. సహ్యాద్రి, సామ్ ఫార్మ్స్ సందర్శన ద్వారా అనేక కొత్త అంశాలు తెలిసాయని తెలిపారు.
తెలంగాణలో కూడా రైతులు ఎఫ్పీవోలుగా ఏర్పడి తమ పంటలను మార్కెట్ చేసుకోవాలని సూచించారు. మూస పద్ధతుల సాగును విడిచిపెట్టి, రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నాసిక్ పర్యటనలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో పాటు సభ్యులు రాములు నాయక్, కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, మెంబర్ సెక్రటరీ గోపాల్, కమిషన్ అధికారులు సంధ్యారాణి, హరి, స్రవంతి, రజిత, ఎఫ్పీవో ప్రతినిధులు ఉపేందర్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. నేడు కూడా రైతు కమిషన్ బృందం నాసిక్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించనుంది